# 8. కుర్చీ

ఆ వూళ్లో వెయ్యి ఇళ్లు వున్నాయ్. అందులో రెండు వందల ఇళ్లు మాత్రం వాస ఇళ్లు. మిగిలిన వన్నీ గుండ్రని ఒంటి గది మట్టి ఇళ్లే.

ఆ వూళ్లో ఉత్తరాన్న వున్న ఆఖరి ఇల్లు వెంకట స్వామిది. అతడు ఆ వూరికి పెద్ద. అతడు వూరికి పెద్దయినా - అతడి ఇల్లు కూడా ఒంటిగది మట్టి ఇల్లే.

ఆ ఇంటికి మీది తాటాకులు బాగా ఎండిపోయి, విరిగి, రాలి పోతున్నాయ్ . ఎండ ఇంట్లోకి చొరబడుతూనే వుంది. వానొస్తే ఇంట్లోకి పడుతూనే వుంది.

చోడిచొప్ప ఆ తాటాకుల మీద పరిచి తల దాచు గుంటున్నాడు.

వెదుళ్లు బిగి తప్పి, కిందికి జారిపోతున్నాయ్. .

అతడు మిగిలిన ఎకరా భూమితో కుస్తీ పడుతూ బతుకుతున్నాడు.

కుటుంబ భారం పెరిగి పోయిన అతడు బాగా ఒంగి పోయాడు. ముసల్ది జబ్బుతో మూల్గు తోంది. తాటి తడపల మంచాన్ని అంటుకుపోయి- రోజులు లెక్కెడుతోంది. కొడుకు చచ్చి పోయాడు. కోడలు పిల్ల సగం చచ్చి, బతుకుతోంది. మనవడూ- మనవరాలూ ఎముకల గూడుల్లా జీవిస్తున్నారు. వయస్సు మళ్లిన వెంకట స్వామి, కుటుంబ భారం మోయలేక, మూల్గుతున్నాడు.

చెట్టంత కొడుకు చచ్చి పోడంతో, ఏనుగంత వెంకటస్వామి, పీనుగయి పోయాడు.

* * *

పిడుగు లాంటి తన కొడుకు ఎలా చచ్చిపోయాడో - అతడు చెప్తూ వుంటాడు.

'.... నా కొడుకు రూపాయిలు అప్పు తెచ్చి నాడు. అది కాగితం లో మూడు ఏలయి గూకుంది. అది కోరుటులో దెయ్యమయి గూకుంది. బూతంలా పెరిగి పోయి గూకుంది. కోరుటేటిసేసింది? కాగితాలు సూసింది. 'ఎట్టీ ! ఆడి సేతుల్లో ఎట్టీ ! నీ మూడెకరాల బూవీ ఆడి సేతుల్లో ఎట్టీ!' అని సెప్పేసింది.

నా కొడుకు సేసిన నేరం ఏటి? ' దొంగ సాచ్చెం సెప్పు.సెప్పక పోతే - నా బతుకు ఈదిలో పడిపోద్ది! నాకు పరువు పోద్ది! నువు దొంగ సాచ్చెం సెప్పేసి నీ అప్పు కాగితాలు అట్టుకు పో! 'అని కొండబాబు నా కొడుకుని అడిగి నాడు. 'సచ్చినా, నాను దొంగ సాచ్చెం సెప్పను! ఓడి

బతుకూ అగ్గిలోకి దోసీలేను! నువు సేస్తున్న పాపాలు, నిన్ను దినేస్తాయి గానీ, నిన్ను ఒగ్గవు.! ' అని నా కొడుకు నిబ్బరంగా నిజం కోసం నిలబడి పోనాడు. ఉడుం పట్టు పట్టుగుని గూకున్నాడు. 'అయితే , సావు ! .. .. ' అని కొండబాబు చెప్పి, కాగితాలు కోరుటులో ఏసినాడు. మా మూడెకరాల బూవీ లాక్కు్న్నాడు. అంతే - పిడుగు పడ్డ సెట్టులా - సెట్టు లాటి నా కొడుకు - ఎండి సచ్చి పోనాడు ... .'అలా అతడు చెప్పి, తన కొడుకు నిజం కోసం ఎలా నిలబడ్డాడో చెప్తూ, గర్విస్తాడు.

* * *

వెంకటస్వామి, ముసిలెద్దలకు నీళ్లు పెట్టి, ఇల్లు చేరాడు.

ఆరడుగుల ఎత్తున్న అతడు కూర్చుని పంచ దూరాడు. అయినా - జారిన వెదురు కొర్రు బుర్రకు తగిలింది. బొడిపి కట్టింది. కొద్దిగా రక్తం చిమ్ముతోంది.

తల పాగా చిరిగి పోయిందనీ, బుర్ర తడుముగుంటూ, ముసిల్దాని ముఖంలోకి చూస్తూ, చెప్పాడు.

ముసల్ది అతడికి దెబ్బ తగల్డం చూడలేదు. అతడి మాటలు వినలేదు.

బలుసాకు ఏరుతున్న ముసల్ది, 'ఇది మాపిలికిరా! ' అని అతడి మొహంలోకి చూస్తూ, బాధగా మూల్గుతూ, నవ్వింది.

'మనం బలుసాకు మేకలకి మిగల్సవన్న మాట!' అని అతడు మనసులో అనుకుని, వెకిలిగా నవ్వాడు. అలా నవ్వి, కుక్కి నులకమంచం మీద కునుకుతున్న మనవణ్నీ- మనవరాల్నీ చూసాడు.

బొడిపిని తడుము గుంటూ, నూనె బొట్టుకోసం గదిలో అడుగు పెట్టాడు.

ఏటి మాయ్యా! ఏటి గావాల?!' కోడలు అడిగింది.

నూనె బొట్టు.... ' బొడిపి తడువుగుంటూ అన్నాడు.

'నీళ్లు ఇద్దునా ! . . . ' అని అడిగింది. నూనె లేదని చెప్పలేదు.

కోడలు చిరిగిన చీరల్తో రోజులు గడుపుతోంది. అతడికి కళ్లు తిరిగాయ్.

'తొలకరి ముందు ఇల్లు నెయించాలః నేకపోతే, ఒరిగి పోయి పడిపోద్ది!' అని అనుకుని ఇంటి కప్పు మరో సారి చూసాడు.

* * *

వెంటనే అతడు చిరిగి పోయిన చెప్పుకి తాడు కట్టాడు. చెప్పులు తొడుకున్నాడు. పంచను వేలాడుతున్న, తాటాకుల గొడుగు తీసాడు. ఆ గొడుక్కి చేతి కర్ర తగిలించాడు. అప్పుడు కొండబాబు దగ్గరకు బయలు దేరాడు.

ఎండ ఎండగా వుంది. మండు టెండ మండి పోతోంది. నిప్పులు చెరుగుతోంది. వేడి

గాలి వేడిగా, పొడిగా వీస్తోంది. ఎర్ర ధూళి రివ్వున లేస్తోంది. చెట్ల లోని పక్షులు బిక్క చచ్చి , చూస్తున్నాయ్. చెట్ల ఆకులు వాడి పోయి, వేలాడుతున్నాయ్.

ఆ ఎండలో - ఆ వేడి గాలిలో - నిప్పుల మీద నడుస్తున్నట్లు, అతడు నడుస్తున్నాడు.

ఆ ఎండ - అతడి గుండెల్లో మంటలా - మండుతోంది. ఆ గాలి - అతడి వూపిరిలా - వేడి గాడ్పులా వుంది.

* * *

కొండబాబు – విశాలమైన హాల్లో కూర్చున్నాడు.

ఆ హాలు గోడల మీద అక్షర రూపంలో అష్ట దిగ్గజాలున్నాయ్. ఆ అక్షరాలు కళాత్మకంగా వున్నాయ్. అవి కళా తపస్సు చేస్తున్నాయ్.

నీతి, న్యాయం, ధర్మం, నిజం, నిజాయితీ, అహింస, మానవత, సమానత. . .

ఈ అష్ట దిగ్గజాలకీ అతడు అంకిత మైపోయి - సత్యం,- శివం - సుందరం గా జీవిస్తున్నాడని
ఆ గోడలు చెప్తూ వుంటాయ్.

అంతే గాకుండా, ఆ హాల్లో అందమైన తివాసీలు- అందమైన సంక్రాంతి ముగ్గుల్లా- కళాత్మకంగా వున్నాయ్.

ఆ తివాసీల మీద ఎందరెందరో గుంపులు గుంపులుగా అతని అనుచరులూ, అభిమానులూ- కూర్చున్నారు.

అతడు కుర్చీలో కూర్చున్నాడు. ఆ కుర్చీ చందనం కర్రతో చేయబడి, సుందరంగా వుంది.

ఆ కుర్చీ సుగంధంగా, పరిమళంగా వుంది. అతని కాళ్లు, ఆ కుర్చీ చేతుల మీద వున్నాయ్. అతని చేతులు, ఆ కుర్చీ శిరస్సు మీద వున్నాయ్.

ఆ హాలుకి బయట, విశాల మైన పందిళ్లు వున్నాయ్. ఆ పందిళ్లు ప్రజలతో నిండుగా వున్నాయ్.

* * *

వెంకట స్వామి, కొండ బాబు ఇంటి దగ్గరకు చేరాడు. ప్రహారీ గోడ గుమ్మం దగ్గర నిలబడ్డాడు. కర్రకు తగిల్చివున్న తాటాకుల గొడుగుని తీసి, పక్కకు పెట్టాడు. కర్ర చేత్తో పట్టుకుని, లోపలకు తొంగి చూసాడు. అక్కడ అంతా సందడిగా, ఉత్సవంలా వుంది.

ఓట్ల కోసం, ఉత్సవాలు జరుగుతున్నాయని తెల్సుకున్నాడు. కొండబాబు పదవి కోసం ఆ ఉత్సవాలు జరిపిస్తున్నాడని తెల్సుకున్నాడు.

జనంలో వూపిరాడకుండా తిరుగుతున్న కొండబాబు, జనంలోంచి వెంకటస్వామిని చూసాడు.

ముందుకు వెళ్లి, రమ్మని పిల్చాడు. ' నానే ఒద్దామనుకుంటున్నా! నువ్వే ఒచ్చేసి నావు! మంచి దయింది! ' అని కొండబాబు, వెంకటస్వామి రావడం మంచిదయిందని చెప్పాడు.

'నువు నా కొడుకుని దినేసినావు! అయినా, నీ కాడకు నాను రాక తప్పనేదు?' అని వెంకటస్వామి, వెంటనే జవాబు చెప్పాడు. అలా చెప్పి, 'నువు దినీగా, నా కాడ ఎకరా గరువు మిగిలింది. దాని మీద అయిదు వందలు అప్పుగావాలి' అని వచ్చిన పని, వెనువెంటనే చెప్పాడు. కొండబాబు, అతడికి దగ్గరగా వెళ్లాడు. అతడి భుజం మీద చెయ్యి వేసాడు. అతడి చెవిలో, నెమ్మదిగా, ఆప్యాయంగా, అయిదు నిమషాలు మాట్లాడేడు.

'నువు అయిదొందలు తాకట్టుమీద అడిగినావు! నాను ఏ తాకట్టూ నేకుండా ఎయ్యి రూపాయిలిస్తున్నాను! నువు తిరిగివ్వొద్దు! అట్టు కెళ్లు!' అని అతడి చేతుల్లోకి వెయ్యి రూపాయల కట్ట అందించాడు.

'ఒద్దు బాబూ - ఒద్దు! నీ ఎయ్యి రూపాయిలూ నీ కాడే ఉంచుగో! కోడలికి కోక నేక పోయినా - నా బొడిపికి నూనె బొట్టు నేక పోయినా - నీ డబ్బు నా కొద్దు! ఇల్లు కూలి పోయినా- మాం మాడిపోయి, నచ్చి పోయినా - నీ డబ్బు నాకొద్దు! నా గరువు నాను తాకట్టు ఎట్టీగల్ను ! నా వూరు నాను తాకట్టు ఎట్టీనేను!' అని వెంకట స్వామి, వెనక్కి తిరిగి చూడకుండా, ముందుకు గాలిలా దూసుకుని, తన వూరు వేపు నడిచాడు.

* * *

కొండ బాబు, ఆ విశాల మైన హాల్లో కూర్చున్నాడు. అతడు కుర్చీలో కూర్చున్నాడు. ఆ కుర్చీ చందనం కర్రతో చేయబడి, సుందరంగా వుంది. ఆ కుర్చీ సుగంధంగా, పరిమళంగా వుంది. అతని కాళ్ళు ఆ కుర్చీ చేతుల మీద వున్నాయ్. అతని చేతులు, ఆ కుర్చీ శిరస్సు మీద వున్నాయ్. ఆ హాల్లో అందమైన తివాసీలు - అందమయిన సంక్రాంతి ముగ్గుల్లా - కళాత్మకంగా వున్నాయ్.

ఆ తివాసీల మీద ఎందరెందరో, గుంపులు గుంపులుగా, అతని అనుచరులు- అభిమానులు - కూర్చున్నారు.

ఆ హాలుకి బయట, విశాల మైన పందిళ్లు వున్నాయ్. ఆ పందిళ్ళు ప్రజలతో నిండుగా వున్నాయ్.

అక్కడ ఓట్ల కోసం ఉత్సవాలు జరుగుతున్నాయ్.

అక్కడ శాస్త్రీయ సంగీతం వుంది. వేద పఠనం వుంది. నగ్న నృత్యాలున్నాయ్. శృంగార సంగీతం వుంది. వైన్సు వున్నాయ్. విందులున్నాయ్. శృంగారం వుంది. సరసాలున్నాయ్. జూదం వుంది. ఎత్తులున్నాయ్. నవ్వులున్నాయ్. నవరసాలున్నాయ్. అరుపులున్నాయ్. కేకలున్నాయ్.

నినాదాలున్నాయ్.

కొండబాబు అలా కుర్చీలో కూర్చున్నాడు.

ఎదురుగా - గోడల మీద కళాత్మకంగా వున్న 'సత్యం - శివం - సుందరం ' అనే మాటలు చూస్తున్నాడు.!

అలాగే గోడల మీద -కళాత్మకంగా - కళా తపస్సు చేస్తున్న - - -

నీతి, న్యాయం, ధర్మం, నిజం, నిజాయితీ, అహింస, మానవత, సమానత. . .

- - అనే మాటల్ని వరసగా చూస్తున్నాడు.!

ఆ మాటలు గోడలమీద అందంగా - ఆకర్షణీయంగా వున్నాయని అని అనుకుంటూ, దిగ్గున లేచి నిలబడ్డాడు.!

గాలిలో దూసుకుంటూ, వూరివేపు తిరిగి వెళ్లి పోతున్న వెంకటస్వామిని చూస్తూ నిలబడ్డాడు! ఇసుకలో లోతుగా కనబడుతున్న వెంకటస్వామి అడుగు జాడలు చూస్తూ నిలబడ్డాడు!

కొండబాబు అలా నిలబడే వున్నాడు!

అయితే - అతడు కుర్చీ లో కూర్చున్నట్లూ, ఆ కుర్చీ బూవిలోకి కూరుకు పోతున్నట్లూ, కలవరపడుతున్నాడు!

(జ్యోతి, మాస పత్రిక - సెప్టెంబరు, 1970)